ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 3 ఫిబ్రవరి 2024



- అరకొర వసతులు
- విద్యార్థినులకు సరిపడా లేని గదులు
- ముందుకు సాగని కళాశాల భవన నిర్మాణం
- 2020లో ప్రారంభించినా పూర్తికాని వైనం
- సమస్యలతో సతమతమవుతున్న కస్తూర్బా విద్యార్థినులు

ఇలాగుంటే చదివేదెట్లా..!

అన్ని రకాల వసతులతో కార్పొరేట్ విద్య కంటే మెరుగైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా.. ఆచరణలో మాత్రం కనిపించడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కస్తూర్బాలో బాలికలకు కనీసం మంచినీరు లేక బోరు నీరు తాగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్ఓ ప్లాంటు పనిచేయక పోయినా, గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకొనేవారు లేరు. విద్యార్థుల కోసం ఎంతో చేస్తున్నామని డప్పు కొడుతున్న ప్రభుత్వం.. కనీస సౌకర్యాలు కల్పించలేదా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చనిపోతానేమో అనుకున్నా..



కాలుజారి మిద్దెపై నుంచి కింద పడిపోయాను. చనిపోతానేమో అని భయపడ్డాను. మా టీచర్లు నన్ను హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఒక కాలు విరిగింది. ఇప్పటికీ నడవాలంటే కాలు నొప్పిగా ఉంది. స్కూల్ బిల్డింగ్ పైభాగంలో గదులు ఉన్నాయి. ఆ గదుల దగ్గరికి వెళ్లాలంటే భయం వేస్తోంది. రాత్రిపూట గదుల నుంచి బయటకు రాలేకున్నాం. నాతో పాటు స్కూల్‌లో చాలా మంది పై భాగంలో ఉన్న గదులకు వెళ్లాలంటే వెళ్లడం లేదు.

- మధుప్రియ, 6వ తరగతి

వసతులు లేకుండానే ఇంటర్మీడియట్‌కు అనుమతి..



ఇళ్లు కట్టకుండానే గృహ ప్రవేశాలు చేయడం ఈ ప్రభుత్వానికి బాగా అలవాటు. పక్కా భవనాలు, వసతులు లేకుండానే ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అనుమతులు ఇవ్వడం బాధాకరం. ప్రయోగశాల లేకుండా విద్యార్థులు ఎలా ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేస్తారు. విద్యార్థినులకు సరైన వసతులు కల్పించకపోతే ఎలా చదువుతారు. నాణ్యమైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి మిగిలిన వసతులు కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి. నాణ్యమైన విద్య అందించాలి.

- కత్తి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

సుండుపల్లె, ఫిబ్రవరి 2: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో గల అక్కంపల్లి సమీపంలో దాత మల్లు శివారెడ్డి ఐదు ఎకరాల భూమిని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ నిర్మాణం కోసం కేటాయించారు. ఆ స్థలంలో కేజీబీవీ నిర్మాణం చేశారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 250 మంది, ఇంటర్మీడియట్‌లో 67 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పక్కన బాలికల సౌలభ్యం కోసం 2019లో జూనియర్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రూ.1.60 కోట్లతో 2020 సంవత్సరంలో పనులు ప్రారంభించి బేస్‌మట్టం వరకు చేసి నిలిపివేశారు. కాంట్రాక్టర్ పనులు చేయకుండా వదిలేయడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. పాఠశాల, కళాశాల రెండూ పాత భవనంలోనే కొనసాగుతున్నాయి. దీంతో అందరికీ గదులు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది విద్యార్థినులు వసతులు లేక ఇతర కళాశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ఆగిపోయి మూడు సంవత్సరాలవుతున్నా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు కానీ పాలకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

కాంట్రాక్టు పనుల కోసం రక్షణ గోడను కూల్చేశారు

కాంట్రాక్టు పనులపై వ్యామోహంతో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం భవనంపై ఉన్న రక్షణ గోడను కూల్చేశారు. నాడు-నేడు పనుల్లో భాగంగా నిధులు వస్తాయని గదుల నిర్మాణం చేయాలని పైన ఉన్న రక్షణ గోడను కూల్చేయడంతో పాఠశాలలోని ఇద్దరు విద్యార్థినులు కొన్ని నెలల కిందట 1వ అంతస్తు నుంచి కిందపడ్డారు. 9వ తరగతికి చెందిన దీక్ష అనే విద్యార్థిని పై అంతస్తు నుంచి పడడంతో చెయ్యి విరిగి తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం పాఠశాలకు కూడా రాకుండా ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటోంది. అదేవిధంగా 6వ తరగతికి చెందిన మధుప్రియ అనే విద్యార్థినికి కాలు విరగడంతో వారి తల్లిదండ్రులు ఆ విద్యార్థినికి వైద్యం అందించి ఇప్పుడు పాఠశాలకు పంపిస్తున్నారు. రక్షణ గోడ వెంటనే నిర్మించకపోతే ప్రమాదాలు ఇంకా జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు.



రక్షణ గోడ తొలగించిన దృశ్యం

ఆరోగ్యం బాగాలేక కాంట్రాక్టర్ పనులు ఆపేశారు..

రూ.1.60 కోట్లతో పనులు ప్రారంభించాం. కరోనా కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. బేస్‌మట్టం వరకు కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. రూ.40 లక్షల వరకు బిల్లులు కూడా మంజూరయ్యాయి. అనారోగ్యం కారణంగా కాంట్రాక్టర్ పనిచేయలేనని లెటర్ రాసి పనులు ఆపేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మళ్లీ టెండర్ పూర్తయిన తర్వాత కళాశాల భవన నిర్మాణం పూర్తి చేస్తాము. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము.

- షేక్ జిలానీ, ఏఈ, సమగ్రశిక్ష అభియాన్

ఏడాది క్రితం చెడిపోయిన ఆర్వో ప్లాంట్

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని డప్పు కొడుతున్న ప్రభుత్వం కనీసం విద్యార్థులకు మంచినీటిని అందించలేని దయనీయ పరస్థితిలో ఉందా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు-నేడు పనుల్లో భాగంగా ఆర్వో ప్లాంట్స్‌ను అరకొరగా అందించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శలు వస్తున్నాయి. ఏడాది క్రితం ఇక్కడి ఆర్వో ప్లాంట్ చెడిపోయినా ఇంతవరకు దాని మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. విద్యార్థినులు ఏడాది నుంచి బోరు నీటినే తాగుతున్నారు. బోర్ల నుంచి నీటిని ప్లాస్టిక్ ట్యాంకుల్లో నిల్వ చేస్తున్నారు. ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్న నీటిని తాగి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 300 మందికి పైగా విద్యనభ్యసిస్తున్న కేజీబీవీలో ఆర్వో ప్లాంట్ ఏడాది క్రితం పాడైపోయినా దానిని మరమ్మతు చేసే నాథుడే లేడు. నెల క్రితం మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. స్పెషల్ ఆఫీసర్‌గా శివ శ్రుతి కొత్తగా బాధ్యతలు స్వీకరించడం వలన ఆ నిధులు ఎలా డ్రా చేయాలో అర్థం కావడం లేదన్నారు. ఆ నిధులు స్కూల్ అకౌంట్‌కు రావాలంటే సచివాలయంలో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్టిమేట్ వేయాలి. వారికి కూడా ఎలా చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విధంగా అనేక సమస్యలు ఆ పాఠశాలలో తిష్ట వేసుకుని ఉన్నాయి.

గదుల కొరతతో స్టాఫ్‌రూమ్ కూడా లేదు..



పాఠశాలలో విద్యార్థినులు గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠాలు చెప్పాలన్నా, రాత్రిపూట పడుకోవాలన్నా విద్యార్థినులకు గదులు సరిపోవడం లేదు. ఉపాధ్యాయులకు సైతం స్టాఫ్‌రూమ్ లేకపోవడంతో ఆరుబయట బెంచీలపైన కూర్చుని భోజనం చేయాల్సి వస్తోంది. ఉన్న స్టాఫ్‌రూమ్‌ను తరగతి గదుల కోసం వినియోగిస్తున్నాము. విద్యార్థులు చెట్ల కింద కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- రెడ్డిగీత, తెలుగు ఉపాధ్యాయురాలు

ప్రయోగశాల కోసం ప్రైవేటు కళాశాలకు వెళ్తున్నాం..



కస్తూర్బా స్కూల్‌లోనే పదవ తరగతి చదివాను. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. మెరుగైన విద్య లభిస్తుందని ఇక్కడే ఇంటర్ జాయిన్ అయ్యాను. ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఇక్కడ ప్రయోగశాల లేకపోవడం వలన విద్యకు దూరం అవుతున్నాను. ప్రాక్టికల్స్ చేయాలంటే మండల కేంద్రంలో ఉండే ఓ ప్రైవేటు కళాశాలకు వెళ్లి ప్రయోగాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. వెంటనే జూనియర్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి ప్రయోగశాలను నిర్మిస్తే చదువుకునేందుకు వీలు ఉంటుంది.

- గౌరీ, విద్యార్థిని, ఇంటర్మీడియట్



అర్ధాంతరంగా ఆగిన కేజీబీవీ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం



తాగునీటికి వినియోగిస్తున్న ప్లాస్టిక్ ట్యాంకులు

అనుమతి లేకుంటే సీజ్

- 30 ప్రైవేటు ఆసుపత్రులు, 115 స్కానింగ్ సెంటర్ల సీజ్‌కు రంగం సిద్ధం
- 20 రోజుల కిందటే నోటీసులు
- అయినా పర్మిషన్ తీసుకోని వైనం

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేటు క్లీనిక్‌లలో, స్కానింగ్ సెంటర్లలో వైద్య సేవలు అందించడం కుదరదని వైద్యాధి కారులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసి సీజ్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ప్రైవేటు వైద్యులు, ఆర్ఎంపీలు అనుమతులు లేనిదే వైద్య సేవలు అందిస్తే చర్యలు తీసుకుంటామని అంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు అనుమతి లేని ఆసుపత్రులు 30, స్కానింగ్ సెంటర్లు 115 ఉన్నాయని అధికారులు గుర్తించారు. వీరికి ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా, ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో వారి ఆసుపత్రులను సీజ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కోట్లు ఖర్చు పెట్టి ఆసుపత్రులు కడుతున్నా, అందులో అనుమతి తీసుకోవడానికి వెనుకాడుతున్న డాక్టర్ల లిస్టు మొత్తం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల పనితీరు, అక్కడ పని చేస్తున్న వైద్యులు నిజంగానే డాక్టర్ చదివారా లేక ఏదైనా నకిలీ సర్టిఫికెట్లతో హాస్పిటల్‌లు పెట్టారా అన్న విషయాలపై జిల్లా అధికారులు ఆరా తీసే పనిలో ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె ప్రాంతాల్లో వీధికి ఒక ఆసుపత్రి పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారి లిస్ట్ మొత్తం సేకరించామని జిల్లా అధికారులు చెబుతున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజారోగ్యాల దృష్ట్యా పట్టణాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు ఆసుపత్రులకు కళ్లెం వేయాలంటే నిబంధనలు తప్పనిసరిగా ఉంటేనే వాటిని కొనసాగిస్తామని, లేనిపక్షంలో నిర్మొహమాటంగా కేసులు పెట్టి హాస్పిటల్ సీజ్ చేయడానికి ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలున్నాయని డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు వెల్లడించారు. ఒక ఆసుపత్రి పెట్టే ముందు డాక్టర్ సర్టిఫికెట్‌తో పాటు బిల్డింగ్‌కు సంబంధించిన మొత్తం అనుమతులు తీసుకొని వైద్య ఆరోగ్యశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఏమీ పాటించకుండా ఎంబీబీఎస్ ఉన్నా, లేకపోయినా టెన్త్ క్లాస్ పాస్ అయిన వారు కూడా బోర్డులు పెట్టి విచ్చలవిడిగా రాత్రికి రాత్రే క్లీనిక్‌లు ప్రారంభిస్తున్నట్లు అధికారులు సమాచారం సేకరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 14 మంది మాత్రమే ఆర్ఎంపీలు, ప్రభుత్వ వైద్యులు అనుమతులు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. దాదాపు నెల రోజులుగా వీరందరికీ నోటీసులు ఇచ్చినా, ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో చివరికి చేసేది లేక వారి ఆసుపత్రులు సీజ్ చేయడానికి గత కలెక్టర్ అనుమతులు రద్దు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయంపై డీయంహెచ్‌వో కొండయ్యను వివరణ కోరగా పై అధికారుల ఆదేశాల మేరకు అనుమతి లేని ఆసుపత్రులను సీజ్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

అనుమతులు లేని ఆసుపత్రులు ఇవే..

ఆర్ఎస్ ఆప్టికల్స్ (రాజంపేట), మహేశ్ కంటి ఆసుపత్రి (రాజంపేట), లైఫ్ కేర్ హాస్పిటల్ (మహల్), అమ్మ కేర్ హాస్పిటల్ (కలికిరి), కేకే హైటెక్ డెంటల్ హాస్పిటల్ (పీలేరు), వీఎస్ డెంటల్ కేర్ హాస్పిటల్ (కలికిరి), అపర్ణ క్లీనిక్ (కలికిరి), వీఆర్ హాస్పిటల్ (పీలేరు), లైఫ్ ల్యాబ్స్ (పీలేరు), ఉషోదయ హాస్పిటల్ (రాయచోటి), న్యూలైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ (రాయచోటి), సుశ్రుత హాస్పిటల్ (రాయచోటి), విజయ హాస్పిటల్ (రాయ చోటి), హేమంత్ హాస్పిటల్ (రాయచోటి), ధరణి హాస్పిటల్ (రాయచోటి), సురక్ష తల్లి పిల్లల హాస్పిటల్ (రాయచోటి), శ్రేయాన్స్ ఐ హాస్పిటల్, నలనా హాస్పిటల్ (రాయచోటి), కంప్యూటరైజ్డ్ అలర్జీ హాస్పిటల్ (రాయచోటి), శ్రీభవ్య హాస్పిటల్ (మదనపల్లె), లైఫ్‌కేర్ హాస్పిటల్ (సుండుపల్లె), నిస్సార్ చిల్డ్రన్ క్లీనిక్ (రాయచోటి), జనత హాస్పిటల్ (రాయచోటి), బాలాజీ హాస్పిటల్ (సుండుపల్లె), భారత్ స్పెషాలిటీ హాస్పిటల్ (రాయచోటి), శ్రీసాయి నర్సింగ్‌హోమ్ (రాజంపేట), శ్రీసాయి బాలాజీ హాస్పిటల్ (పీలేరు), గ్లోబల్ హాస్పిటల్ (మదనపల్లె), శ్రీ సురభి మదర్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ (రాయచోటి), మన్సూర్ హాస్పిటల్ (సుండుపల్లె). ఈ హాస్పిటల్ మాజమాన్యానికి దాదాపు 20 రోజుల క్రితమే నోటీసులు ఇచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం

- పోలింగ్ కేంద్రాల్లో వందశాతం కనీస సౌకర్యాల ఏర్పాటుకు కృషి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిశిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రచురించిన పిదప అందిన దరఖాస్తు ఫారాలను త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ అభిశిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి 2024 తుది ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, దరఖాస్తుల పరిష్కారం, 18-19 యువ ఓటర్ల నమోదు, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వెబ్‌కాస్టింగ్, ఈవీఎం వీవీ ప్యాట్ల భద్రత, ఎన్నికల నిర్వహణ ఖర్చు తదితర అంశాలపై ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిశిక్త్‌కిశోర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఈ వీసీలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 2024 తుది ఓటరు జాబితా ప్రచురించిన పిదప రాజకీయ పార్టీలు, ఇతరుల నుంచి అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ఇంకనూ సుమారు 16,500 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. అలాగే తుది ఓటరు జాబితాపై 604 చేర్పులు, 189 తొలగింపులకు విజ్ఞప్తులు వచ్చాయని, వీటిని కూడా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 18-19 సంవత్సరాల యువత 31,700 మందిని నమోదు చేశామన్నారు. ఇంకనూ సుమారు 19 వేల మంది యువ ఓటర్లను నమోదు చేయాలన్న అంచనా ఉందన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో వందశాతం కనీస సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో ప్రస్తుతం 16 కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవని, వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు జిల్లా కేంద్రంలోని గోదాములో తగిన భద్రత, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితాకు కృషి చేయాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి కమిషన్ జారీ చేసిన తాజా నిబంధనలు, మార్గదర్శకాలు, రిటర్నింగ్ అధికారుల హ్యాండ్‌బుక్, చెక్‌లిస్టు తదితరాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. డీఆర్‌వో సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2023-24 సంవత్సరానికి సంబంధించి మార్చి 1 నుంచి 20 వరకు జిల్లాలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై ఇంటర్మీడియట్ విద్య, ఏపీఎస్ఆర్టీసీ, పోలీసు తదితరశాఖ అధికారులతో సమన్వయ కమిటీతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాపీయింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లో తావివ్వరాదని ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కృష్ణయ్య మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 29,833 మంది పరీక్షలు రాయనున్నారని, వీరిలో మొదటి సంవత్సరం 14,731 మంది, రెండవ సంవత్సరం 15,102 మంది ఉన్నట్లు తెలిపారు. వివరణాత్మక పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు, ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు జరగనున్నట్లు తెలిపారు. జేసీ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందే చేరుకోవాలని సూచించారు.

ఫ్యానుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప (క్రైం), ఫిబ్రవరి 2: కడప నగరం ముత్తరాసుపల్లెలో నివాసం ఉంటున్న పామిడి బాల సుబ్బరాయుడు (29) ఎన్జీఓ కాలనీలోని కెంట్ వాటర్ ప్యూరిఫైడ్ కార్యాలయంలో గురువారం ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు... దువ్వూరు మండలం మదిరేపల్లె గ్రామానికి చెందిన బాలసుబ్బరాయుడికి ఖాజీపేట మండలం కొత్తపేటకు చెందిన గాయత్రితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక సంవత్సరం వయస్సు గల కుమారుడు ఉన్నారు. సుబ్బరాయుడు ఫ్యామిలీతో కడప ముత్తరాసుపల్లెలో నివాసం ఉంటున్నాడు. కెంట్ వాటర్ ప్యూరిఫైడ్ కంపెనీలో డిస్ట్రిబ్యూటరుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఆఫీసులోనే ఉన్నాడు. అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో ఆఫీసులోని ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోలేరమ్మ అమ్మవారి గుడిలో చోరీ


హుండీని పగలగొట్టిన దుండగులు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 2: ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠంలోని శ్రీకనుమ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోకి ప్రవేశించి హుండీలోని డబ్బులను చోరీ చేశారు. ఈవిషయం దేవస్థాన సిబ్బంది స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బి.మఠం ఎస్‌ఐ విద్యాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. దేవదాయ శాఖ అసిస్టెంటు కమిషనరు ఫిట్‌పర్సన్ శంకర బాలాజీ వివరణ కోరగా.. హుండీలో ఎంత డబ్బులు పోయింది అంచనా వేయలేమని ఫిట్‌పర్సన్ తెలిపారు.

కుక్కల దాడిలో 10 పొట్టేళ్లు మృతి


మృతి చెందిన పొట్టేళ్లతో రైతు

చిన్నమండెం, ఫిబ్రవరి 2: మండలంలోని చిన్నర్సుపల్లె గ్రామానికి చెందిన గరుడప్పగారి నరసింహులు అనే రైతుకు చెందిన 10 పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందా యి. గురువారం రాత్రి పొట్టేళ్ల దొడ్డిలోకి కుక్కలు ప్రవేశించి దాడి చేయడంతో 10 పొట్టేళ్లు మృతి చెందాయని, వీటి విలువ సుమారు లక్షా 20వేలు ఉంటుందని బాధితుడు నరసింహులు వాపోయారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వీటి నిర్మూలనకు పంచాయతీ అధికా రులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై పశువైద్యాధికారి గణేశ్‌ను వివరణ కోరగా.. పశువుల బీమా చేసుకున్న వారికి మాత్రమే నష్టపోయినప్పుడు పరిహారం అందుతుందని తెలిపారు.

చోరీ కేసులో దొంగకు జైలు శిక్ష, జరిమానా

కడప (క్రైం), ఫిబ్రవరి 2 : కడప నగరంలోని రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో 2021లో జరి గిన ఓ చోరీ కేసులో కడప నగరానికి చెందిన బుక్కే సతీష్‌నాయక్ అనే వ్యక్తి నిందితుడిగా ఉన్నాడు. ఆ మేరకు అతనికి శుక్రవారం జేఎఫ్‌ఎసీ స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ హేమా స్రవంతి జానకిరామ్ రెండు సంవత్సరాలు జైలుశిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించారు. అప్పటి ఎస్‌ఐ మోహన్ కేసు నమోదు చేసి చార్జిషీటు ఫైలు చేశారు. ప్రస్తుత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పద్మావతి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ గౌస్, కానిస్టేబుల్ రామయ్య కేసును పర్యవేక్షించారు.

బావిలో పడి యువకుడి మృతి

మైదుకూరు, ఫిబ్రవరి 2: బావిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని జీవీ సత్రం వద్ద జరిగింది. అటుగా వెళుతున్న కొందరు పొలంలోని బావిలో చూడగా శవం తేలియాడుతూ ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బావిలో దిగి శవాన్ని వెలికి తీయగా గ్రామానికి చెందిన కూరాకు పవన్‌కుమార్ (25) అని గుర్తించారు. యువకుడి మృతికి సంబంధించి పోలీసుల విచారణలో తెలియాల్సి వుంది.

వాహనాలు ఢీ- తప్పిన ప్రమాదం


దెబ్బతిన్న ట్రాక్టరు ముందుభాగం

వల్లూరు, ఫిబ్రవరి 2 : కడప-తాడిపత్రి జాతీయ రహదారిలో వల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. అయితే అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. ఈసంఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల వివరాల మేరకు... కడప నుంచి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న ట్రాక్టరు, తమిళనాడు వెళుతున్న సిమెంటు ట్యాంకరు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ట్రాక్టరు, లారీ ముందుభాగాలు దెబ్బతిన్నాయి. ట్రాక్టరు డ్రైవరు పరారీలో ఉన్నాడని సమాచారం.

24 మద్యం బాటళ్ల స్వాధీనం-ఒకరి అరెస్టు


పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

చెన్నూరు, ఫిబ్రవరి 2 : చెన్నూరు పార్కు వీధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కె.ప్రసాద్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 25 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పార్థసారధి తెలిపారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా పలు ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టగా.. పార్కు వీధిలో అక్రమంగా మద్యం విక్రయించేందుకు సిద్ధంగా పెట్టిన మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

వల్లూరు, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని మిట్టపల్లెలో శుక్రవారం ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురు జూదమాడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.4200 నగదును స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు, ఫిబ్రవరి 2: మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ తుమ్మణంగుట్ట రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేససుకోవడంతో పాటు నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా 18 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని బి.కొత్తకోట మండలం మల్లూరివారిపల్లెకు చెందిన వెంకటరమణ(40)ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఇదేమి... సుందరీకరణ!

- పులివెందులలో రూ.600 కోట్లకు పైగా ఖర్చు
- అభివృద్ధి పనుల్లో పార్కింగ్‌కు చోటులేని వైనం
- వాహనదారులకు తప్పని పార్కింగ్ కష్టాలు
- చేతులెత్తేసిన అధికార యంత్రాంగం

పులివెందుల రూరల్, జనవరి 2: సుందరీకరణ పట్టణంగా రూపుదిద్దుకుంటున్న పులివెందులలో వాహనదారులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. సుందరీకరణ పేరుతో దాదాపు రూ.600కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నప్పటికీ పార్కింగ్‌కు మాత్రం చోటు దక్కడం లేదు. దీంతో పులివెందుల వాసులకు పార్కింగ్ కలగా మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004లో మేజర్ పంచాయతీగా ఉన్న పులివెందులను మున్సిపాలిటీగా మార్చారు. రోడ్ల విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. అభివృద్ధి పనులు చకచకా సాగిం చారు. అప్పటికి పులివెందుల పట్టణంలో దాదాపు 80వేలకు పైగా జనాభా ఉండేది. పలు సంస్థలు, ఫ్యాక్టరీలో ఏర్పాటు కావడంతో జనాల రద్దీతో ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. అప్పటి అధికారుల చొరవతో పలుచోట్ల పార్కింగ్ స్థలాలు చూపినప్పటికి అది అనుకున్నంత ఫలితం ఇవ్వలేదు. దీంతో పార్కింగ్ కష్టాలు రోజురోజుకు పెరుగుతూ వచ్చాయి.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక పులివెందులను మరింత సుందరీకరణ చేస్తామంటూ వందల కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇందులో పార్కింగ్‌కు చోటు కల్పించి తమ కష్టాలు తీరుస్తారని వాహనదారులు భావించారు. అభివృద్ధి పనులలో అధికారులు చూపిన అత్యుత్సాహం కారణంగా వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. పార్కింగ్ సమస్య మరింత జఠిలంగా మారిపోయింది. అభివృద్ధి పనులు రోడ్డు అంచుల వరకు చేయడంతో పార్కింగ్ సమస్య తీవ్రరూపం దాల్చింది. దుకాణాల ముందే వాహనాలు పార్కింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాల రాకపోకలకు మరింత అంతరాయం ఏర్పడింది. దీనికితోడు రోజువారి వ్యాపారం చేసుకునే తోపుడుబండ్ల వ్యాపారులకు కష్టాలు తప్పడం లేదు. ఇష్టానుసారంగా వాహనాల నిలుపుదలతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పెద్దపెద్ద భవన నిర్మాణాలు సాగిస్తున్నప్పటికీ పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో పట్టణ వాసులను ఆందోళన కు గురిచేస్తోంది.

పట్టణంలోని పాత బస్టాండ్, పార్నపల్లె బస్టాండ్, ముద్దనూరు రోడ్డు, బంగారుఅంగళ్ల వీధి, శ్రీరామ హాల్ రోడ్డు, బైపాస్‌రోడ్డు, పడగొట్టిన బస్టాండ్ సర్కిల్ తదితర రోడ్లలో పార్కింగ్ స్థలాలు ఎక్కడా కనిపించవు. మెయిన్ రోడ్లలో పరిస్థితి ఇలా ఉంటే బోలేవార్డులో మరింత ఎక్కువగా ఉండబోతుందని పలువురు వ్యాపారులు, వాహనదారులు అంటున్నారు. కనీసం రోడ్డుకు మధ్యలో నైనా పార్కింగ్ ఏర్పాటు చేసినా కూడా కష్టాలు తప్పుతాయని వాహనదారులు చెబుతున్నారు. ఎందుకు ఆ దిశగా అధికారులు ఆలోచించలేకపోతున్నారో తెలియడం లేదని అంటున్నారు. రూ.600కోట్లకు పైగా ఖర్చుచేస్తున్నా ఒక్క పార్కింగ్ స్థలం చూపకపోవడంతో అధికారుల ముందుచూపు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

పట్టణంలో పార్కింగ్ లేని కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి సురక్షిత ప్రయాణానికి దారి చూపాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయలేకపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం.


పులివెందుల బంగారు అంగళ్ల వీధిలో దుకాణాల ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలు


ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయకపోవడంతో పట్టణంలో వాహనదారుల గందరగోళం

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి : జేసీ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జాయింట్ కలెక్టర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 2: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. జనవరి 31వ తేదీ నుంచి రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారులను వెలికి తీయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఎంతో మంది గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ బయటకు వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆయన వాలీబాల్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా నిలిచిన రైల్వేకోడూరు జట్టు, రన్నర్స్‌గా నిలిచిన రాయచోటి జట్టు, బాలికల విభాగంలో విన్నర్స్‌గా నిలిచిన రాజంపేట జట్టు, రన్నర్స్‌గా నిలిచిన పీలేరు జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా కోడూరు జట్టు, రన్నర్స్‌గా రాయచోటి జట్టు, బాలికల విభాగంలో విన్నర్స్‌గా మదనపల్లి జట్టు, రన్నర్స్‌గా కోడూరు జట్టు, ఖోఖో బాలుర విభాగంలో విన్నర్స్‌గా రాజంపేట జట్టు, రన్నర్స్‌గా రాయచోటి జట్టు, బాలికల విభాగంలో విన్నర్స్‌గా కోడూరు జట్టు, రన్నర్స్‌గా పీలేరు జట్టు నిలిచాయి. అలాగే కబడ్డీ బాలుర విభాగంలో విన్నర్స్‌గా కోడూరు జట్టు, రన్నర్స్‌గా తంబళ్లపల్లె జట్టు, బాలికల విభాగంలో విన్నర్స్‌గా మదనపల్లె జట్టు, రన్నర్స్‌గా కోడూరు జట్టు, క్రికెట్ బాలుర విన్నర్స్‌గా నిలిచిన పీలేరు జట్టు, రన్నర్స్‌గా రాజంపేట జట్టు, బాలికల విభాగంగా విన్నర్స్‌గా మదనపల్లె జట్టు, రన్నర్స్‌గా కోడూరు జట్టులకు మెమెంటోలతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల ఇన్‌చార్జి నరసరాజు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గౌస్‌బాషా, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ధర్నా

కాంగ్రెస్ నేత బండి జకరయ్య

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 2: ప్రత్యేక హోదా సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా చేపడుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్‌తో కలిసి మాట్లాడారు. 13 జిల్లాలతో ఏర్పడిన ఏపీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ఏపీ రాష్ట్రానికి ఐదు సంవత్సరాలు ప్రత్యేక హోదాతో పాటు కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్, దుగ్గరాజపట్నం ఓడరేవు తదితరాలు మంజూరు చేయడమే కాకుండా.. విభజన హామీలన్నింటినీ ప్రకటిస్తూ అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రధాని రాజ్యసభలో చెప్పడమే కాకుండా కేంద్ర మంత్రివర్గ క్యాబినెట్‌లో కూడా తీర్మానం చేసిందన్నారు. అయితే ప్రధాని హామీని.. కేబినెట్ తీర్మాణాన్ని తరువాత కేంద్రంలో వచ్చిన బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదాపైనే అని ప్రకటించారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధించడానికి ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ప్రొద్దుటూరు డీఎస్పీగా మురళీధర్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 2: ప్రొద్దుటూరు డీఎస్పీగా మురళీధర్ నియమించారు. ఆమేరకు శుక్రవారం ప్రొద్దుటూరు ఎస్‌డీపీవో కార్యాలయానికి చేరుకుని మురళీధర్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈయన 1991 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. కర్నూలు, చిత్తూరు జిల్లాలో పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి రెడ్‌శ్యాండిల్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా వుంటూ ప్రొద్దుటూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ వున్న ఐపీఎస్ ఆఫీసర్ ప్రేర్లకుమార్ బీహార్‌కు బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో మురళీధర్ బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రొద్దుటూరులో ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలో ముఖ్యంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు.

జాతీయస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలకు కట్టా సుబ్బయ్య ఎంపిక


సుబ్బయ్య (ఫైల్‌ఫొటో)

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 2: రాజస్థాన్‌లో ఈనెల 10 నుంచి 11 వరకు జరగనున్న జాతీయస్థాయి వికలాంగ క్రికెట్ పోటీలకు లక్కిరెడ్డిపల్లెకు చెందిన దివ్యాంగుడు కట్టా సుబ్బయ్య ఎంపికయ్యాడు. ఈమేరకు ఇండియన్ కెప్టెన్ వసం తకుమార్ తెలిపినట్లు సుబ్బయ్య తెలిపారు. ఏడాది క్రితం కడపలో జిల్లా దివ్యాంగుల క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు ఈపోటీల్లో కట్టా సుబ్బయ్య బౌలర్, బ్యాట్‌మెన్‌గా రాణించారు. దీంతో ఆగస్టులో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో పాల్గొని తన సత్తా చాటి... రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు సుబ్బయ్య ఎంపికయ్యారు.

ఆటో బోల్తా .. ఐదుగురికి గాయాలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2: కర్ణాటక రాష్ట్రం రాయలపాడు నుంచి ప్రయాణికులతో మదనపల్లెకు వస్తున్న ఆటో బోల్తా పడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. మాలేపాడుకు చెం దిన మల్లికార్జున ఆటోలో ప్రయాణికులు చేరవేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మల్లికార్జున తండ్రి జల్లా బాబు(62)కు అనారోగ్యంతో ఉండటంతో రాయలపాడులో నాటువైద్యం చేయించేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పుడు ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని మదనపల్లె వస్తుండగా మార్గమధ్యంలోని బార్లపల్లె వద్ద ఆవులు అడ్డంగా రావడంతో స్పీడ్‌బ్రేకర్ వద్ద ఎగిరిన ఆటో బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో రెడ్డెప్ప (70), సిద్దమ్మ (75), మల్లికార్జున (50), బాబు (62), శ్రీలక్ష్మి (65) గాయపడగా వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భర్తపై అనుమానంతో...

కాచిన నూనె పోసిన భార్య... ఆపై కుమార్తెకు నిద్రమాత్రలు మింగించి తాను మింగిన వైనం


గాయపడ్డ మహేష్, చికిత్స పొందుతున్న జ్యోతి, లక్ష్మిచందన

కడప (క్రైం), ఫిబ్రవరి 2 : కాపురంలో కలహాలు ఓ కుటుంబంలోని భార్య భర్తలతో పాటు కుమార్తె ప్రాణాల మీదకు తీసుకువచ్చాయి. ఈ సంఘటన కడప నగరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని బెల్లం మండీవీధిలో చోటు చేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఓ గదిలో నిద్రిస్తున్న తన భర్త మహేష్‌పై అనుమానంతో భార్య జ్యోతి కాచిన నూనెను అమాంతంగా పోసేసింది. దీంతో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. తరువాత ఆ గది తలుపు మూసేసి.. తాను మానసిక ఆవేదనకు గురై తన కుమార్తె లక్ష్మి చందనకు నిద్రమాత్రలను ఇచ్చి బలవంతంగా మింగించేసింది. తాను కూడా మరికొన్ని నిద్రమాత్రలను మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వాళ్లు గమనించి తల్లి, కుమార్తెను కడప రిమ్స్‌కు తరలించారు. ఆ సమయంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం 7గంటలకు అపస్మారక స్థితిలో నుంచి మెలకువ వచ్చిన తరువాత తన పెద్ద కుమారుడు భరత్, చిన్నకుమారుడు శ్రీనివాసులు తన దగ్గర ఉండడంతో వెంటనే తన భర్తపై కాచిన నూనె పోసినట్లుగా గుర్తుకు రావడం వెంటనే బంధువులకు, పెద్ద కుమారుడికి ఇంటి తాళం ఇచ్చి పంపించారు. వారు వెళ్లి చూసేసరికి మహేష్ శరీరమంతా కాలిపోయి ఉండడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తీసుకువచ్చారు. ప్రస్తుతం ముగ్గురు రిమ్స్‌లో ఐపీ విభాగంలో వైద్య సేవలను పొందుతున్నారు. మహేష్‌కు, జ్యోతికి వివాహమై 15 ఏళ్లవుతుంది. వీరికి పై ముగ్గురు సంతానం. సెలూన్‌షాపును నిర్వహిస్తూ మహేష్ జీవనం సాగిస్తున్నాడు. మహేష్ మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని అనుమానంతో భార్య జ్యోతి ఈ చర్యకు పాల్పడిందని ప్రాథమిక సమాచారం. మహేష్ తల్లి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ సంజీవరాయుడు తెలిపారు.

ఎరువుల దుకాణాలను పరిశీలించిన అధికారులు

ఖాజీపేట, ఫిబ్రవరి 2: ఎరువుల దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ సంచాలకులు ఎం.నాగరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను, రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో లైసెన్సులు, స్టాక్ వివరాలను, ధరల బోర్డు, బిల్లులు , ఇన్‌వాయిస్ పే బిల్లులు, ఫారం-ఓ, తూకాల స్టాకు, రిజిష్టర్లను తనిఖీ చేశామని, ఎక్కడైనా గడువు ముగిసిన పురుగు మందులను అమ్మినా, స్టాకు నిలువ, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ప్రతిరైతు సరుకు తీసుకున్న వెంటనే రశీదు అడిగితీసుకోవాలని లేదా ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం రావణపల్లె, చెన్నముక్కపల్లె రైతు భరోసా కేంద్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగ అర్చన, రైతు భరోసా కేంద్ర సహాయకులు ప్రశాంత్, మాధురి, రేష్మా, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు

- విశ్వనాథరెడ్డికి మద్దతు తెలిపినందుకేనా?

బి.కోడూరు, ఫిబ్రవరి 2: మండలంలోని రేషన్ షాపులపై శుక్రవారం ప్రొద్దుటూరు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించారు. అందులో బి.కోడూరు-1, బి.కోడూరు-2, శిరిగిరిపల్లె, ఐత్రంపేట షాపులను పరిశీలించి రికార్డులను తనిఖీలు చేశారు. ఈ రేషన్ డీలర్లు ఇటీవల ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి వ్యతిరేకంగా ఆయన బామ్మర్ది విశ్వనాధరెడ్డి ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. కొంత కాలంగా ఈ డీలర్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వద్దకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో వీరిపై విజిలెన్స్ దాడులకు ఎమ్మెల్సీ ప్రోత్సహించారని మండలంలో పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. బి.కోడూరు-1 దుకాణం సీజ్ చేసి రికార్డులు సక్రమంగా లేవని తాళం వేసి స్థానిక వీఆర్వో చేతికి అందించారు. అయితే సంబంధిత డీలరు అన్నీ సక్రమంగా ఉన్నాయని ఏ విధంగా సీజ్ చేస్తారని వాదించారు. అంతలో అసమ్మతి వర్గంలో నెంబర్-2గా చెప్పుకుంటున్న నాయకుడు అక్కడికి చేరుకుని ఎంపీ అవినాశ్ రెడ్డితో ఫోనులో మాట్లాడించడంతో విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన రేషన్‌షాపును తెరిపించి వెళ్లిపోయారు. ఎమ్మెల్సీకి వ్యతిరేకంగా ఆయన బామ్మర్ది విశ్వనాథరెడ్డికి మద్దతు తెలిపినందుకే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇలా వేధింపులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

రైలు కింద పడి యువకుడు మృతి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 2: రైలు కింద పడి ఆర్.విష్ణువర్ధన్(22) అనే యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం వాల్మీ కిపురం సమీపంలోని పునుగుపల్లె ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలిలా...మదనపల్లె మండలం బసిని కొండ ప్రాంతం గంగన్నగారిపల్లెకు చెందిన కనమన్న కుమారుడు ఆర్.విష్ణువర్దన్ వాల్మీకిపురం సమీపంలోని పునుగుపల్లెలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. అయితే వేకువజామున పల్లెకు సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. స్థానిక పోలీసులు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని కదిరి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదానికి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

'జయహో బీసీ' విజయవంతం చేయాలి

పెనగలూరు, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని మండలంలోని బీసీ సోదరులంతా విజయవంతం చేయాలని సమన్వయ కమిటీ సంఘం అధ్యక్షుడు నీరుగట్టు యానాదయ్య తెలిపారు. ఈ సమావేశంలో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు పాల్గొంటున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 2: పచ్చదనం పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌పీ పాణ్యం నారాయణ సూచించారు. చిన్న ఓరంపాడు జెడ్పీహెచ్ స్కూల్‌లో విశ్రాంత ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవితో కలసి పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్గా స్వామీజీ ఆరాధనోత్సవాలు

రామాపురం, ఫిబ్రవరి 2: మండలంలోని నీలకంఠరావుపేట సమీపంలో దర్బార్ సమర్థ సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 3వ తేదీ శనివారం ఉదయం కలశపూజ, సద్గురుపూజ, రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ రుద్ర, సద్గురు హోమాలు, మహామంగళ హారతి, ప్రసాద వితరణ, సాయంత్రం మెరవణి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సిద్దవటం ఎంపీడీవోగా ఉమామహేశ్వరరావు



సిద్దవటం, ఫిబ్రవరి 2: సిద్దవటం ఎంపీడీవోగా ఉమా మహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జవహర్‌బాబు కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉయ్యాలవాడ ఎంపీడీవోగా పనిచేసిన ఉమా మహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు.

అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలు పంపిణీ

పెనగలూరు, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని కె.సి. అగ్రహారం ఎస్టీ కాలనీ, వెలగచర్ల గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయాలుగా ఎంపికైనవారికి శుక్రవారం సాయంత్రం వైస్ ఎంపీపీ-2 కొండూరు విజయ్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో పద్మభూషణ్‌రెడ్డి నియామకపత్రాలు అందజేశారు. ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి, పెనగలూరు సెక్టారు సూపర్‌వైజర్ విజయకుమారి, కొండూరు సెక్టారు సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, ఎంఆర్‌వో డీటీ మురళీకృష్ణ, ఈవోఆర్‌డి బాలాకుమార్ ఉన్నారు.

గాలివీడు ఎస్‌ఐగా వెంకటప్రసాద్



గాలివీడు, ఫిబ్రవరి 2: మండల ఎస్‌ఐగా వెంకటప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలో విధులు నిర్వహించారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ వెంకటశివ కుమార్ అన్నమయ్య జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు.

రాయచోటి ఎస్‌ఐగా బీ. లోకేశ్



రాయచోటిటౌన్, ఫిబ్రవరి 2: రాయచోటి పట్టణ పోలీస్ స్టేషన్-2 ఎస్‌ఐగా ఈ. లోకేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈయన కేవీపల్లె పోలీస్ స్టేషన్ నుంచి రాయచోటి పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కృషి చేస్తానన్నారు.

జూదరుల అరెస్ట్

వీరబల్లి, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ కొత్తవడ్డెపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామ న్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు

రాష్ట్రస్థాయి 'ఖోఖో'కు నందలూరు క్రీడాకారులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నందలూరు జట్టు

నందలూరు, ఫిబ్రవరి 2: ఆడుదాం. ఆంధ్ర పోటీల్లో జిల్లా స్థాయిలో గురువారం జరిగిన మ్యాచ్‌లో నందలూరు మండలానికి చెందిన ఖోఖో బాలుర జట్టు, రాయచోటిజట్టుపై విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. దీంతో శుక్రవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఈవోఆర్‌డీ సతీష్‌కుమార్, మండల నాయకులు, మండల అధికారులు, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

ఎన్నికల సమయంలో డీఎస్సీ నోటిఫికేషనా?



చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు

రాజంపేట, ఫిబ్రవరి 2: నిరుద్యోగ యువత తనను గద్దె దించుతుందన్న భయంతోనే డీఎస్సీ నోటిఫికేషన్‌తో ఓట్ల రాజకీయానికి తెర తీశారని టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు జగన్‌రెడ్డి తీరును ఎండగడుతూ చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు పోలి శివకుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ వేస్తానని హామీ ఇచ్చి గద్దెనెక్కిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో ఒక్క పోస్ట్ కూడా భర్తీ చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిలువునా మోసపోయిన నిరుద్యోగ యువత జగన్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. తెలుగు యువత పార్లమెంటు అధికార ప్రతినిధి జగదాభి పాండురాజు మాట్లాడుతూ నిరుద్యోగ యువతను దృష్టి మళ్లించేందుకే ఫేక్ డీఎస్సీ ప్రకటించారని, యువత జగన్‌మోహన్‌రెడ్డి మాయలో పడొద్దని కోరారు. తెలుగు యువత నేతలు సుహేల్, షేక్ షఫీఉల్లా, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, రాజశేఖర్, ఆది, లక్ష్మణ్, శ్రీనివాసులు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకోని 'ఆసరా'

● సభ మధ్యలోనే మహిళల ఇంటి బాట



సమావేశం మధ్యలోనే ఇళ్లకు వెళుతున్న మహిళలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 2: వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ నిమిత్తం భారీగా మహిళలను తరలించిన అధికారులు, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయక పోవడంతో సభ జరుగుతుండగానే పలువురు మహిళలు ఇంటిబాట పట్టారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ సభకు ఒక్కో గ్రామ సమాఖ్యనుంచి వందమందికి పైగా తరలించాలని గ్రామ సమాఖ్య కార్యకర్తలను అధికారులు, నాయకులు ఆదేశించారు. దాంతో మండలంలోని సుమారు 700కు పైగా డ్వాక్రా సంఘాలనుంచి పెద్ద ఎత్తున మహిళలను తరలించారు. మధ్యాహ్నం 12 గంటలకు వారంతా సభాస్థలికి చేరుకోగా, రెండు గంటలకు సభ ప్రారంభమైంది. కాగా, ఆ ప్రాంతంలో కూర్చోడానికి సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడంతో, ఎక్కువసేపు నిలబడలేని మహిళలు ఎమ్మెల్యే కొరముట్ల ప్రసంగం కొనసాగుతుండగానే గుంపులుగుంపులుగా ఇంటిబాట పట్టారు. కాగా ఈ కార్యక్రమంలో రూ7.9 కోట్ల మెగా చెక్కును మండల సమాఖ్య సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, మహి ళలు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే చర్యలు



సామాజిక తనిఖీ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 2: ఉపాధి హామీ పథకంలో ఉపాధి సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పీడీ యదుభూషణ్‌రెడ్డి హెచ్చరించారు. ఉపాధి పనులపై శుక్రవారం స్థానిక కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ మస్టర్లలో 12,500 రూపాయల అక్రమాలను గుర్తించి రికవరీ చేశారు. హౌసింగ్‌లో అవకతవకలపై సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేసిన పనుల్లో రూ, 2.60 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. వీటితో పాటు హౌసింగ్, ప్లాంటేషన్ వంటి పనులలో పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏపీడీ యుగంధర్ రెడ్డి, అధికారులు సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ ఏఈ సుబ్రమణ్యం, ఏపీవో శివశంకర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్, ఫర్నిచర్ విరాళం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 2: మానవత సంస్థ సౌజన్యంతో ఆ సంస్థ సభ్యుడు ఎస్వీ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సైకం వంశీ బాడీఫ్రీజర్ బాక్సు, 30 ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు. మానవత సంస్థ అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ వెంకట్రమణనాయుడు, రాయచోటిశాఖ చైర్మెన్ అరమాటి శివగంగిరెడ్డి, కోచైర్మెన్ షకీల్, జిల్లా కమిటీ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి వాటిని సీనియర్ వైద్యులు బండారు కిరణ్‌కుమార్, మహేశ్వర్‌రాజు, భాస్కర్‌రెడ్డికి అందజేశారు. మానవత గౌరవ సలహాదారు వెంకట్రమణ, మాజీ అధ్యక్షులు గుండ్లపల్లె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సుండుపల్లె, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాయచోటి జేపీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెకు సంబంధించిన వ్యాధులు, నరాల బలహీనత, కీళ్ల నొప్పులు, కండరాల వ్యాధులకు ఉచితంగా వైద్యం చేసి, మందులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ అండ్ ఎమరెన్సీ ఫిజీషియన్ జయప్రకాశ్‌రెడ్డి, అర్థోపెడిక్ డాక్టర్ అబ్దుల్‌ఘని, మెదడు, నరముల వైద్య నిపుణుడు డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ బిందు పాల్గొంటారని తెలియజేశారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళీ అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి, పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

మామిడి తోటను పరిశీలించిన ఆర్డీవో

సంబేపల్లె, ఫిబ్రవరి2: మండలంలోని దేవపట్ల గ్రామం దేదారకుల మిట్ట సమీపంలో ఉన్న మామిడి తోటను ఆర్డీవో రంగస్వామి శుక్రవారం పరిశీలించారు. గత ఏడాది మార్చిలో అమీన్‌పీర్ అనే రైతుకు చెందిన మామిడి తోట అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో రైతు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన నివేదిక అందడంతో , ఈ ఏడాది తోటను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో మెరుగైన వైద్యం

చిన్నమండెం, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని సచివాలయం-2లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని జిల్లా వైద్యాధి కారి కొండయ్య సందర్శించారు. శిబిరం వద్దకు వచ్చే ప్రజలకు, వైద్య సిబ్బంది అందించే సేవలను పరిశీలించారు. వైద్య సేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారి సునీత రెడ్డితో చర్చించారు. బీపీ, షుగర్ ఇతర వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఎజాస్‌అలీఖాన్, ఎంపీటీసీ రమేశ్, ఈవోపీఆర్‌డీ, ఆర్డీ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తడి నేలలపై అవగాహన అవసరం

సిద్దవటం, ఫిబ్రవరి 2: విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన అవసరమని బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సిద్దవటం రేంజర్ కళావతి, అటవీ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మద్దూరు బీటులోని చిత్తడి నేల బట్టగనప కుంటకు తీసుకెళ్లారు. డిప్యూటీ రేంజర్ ఓబులేసు, కొండూరు సెక్షన్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఆర్‌టీసీ ఎస్‌టీఐని సస్పెండ్ చేయాలి



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 2: సిబ్బందిని వేధిస్తున్న రాజంపేట ఆర్టీసీ డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. శుక్రవారం డిపో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్యూటీల బుకింగ్ విషయంలో అవక తవక లకు పాల్పడుతున్నట్లు డిపో మేనేజర్‌కి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోక పోగా, వేధింపులు మరింత అధికమయ్యాయన్నారు. వెంటనే సమస్య పరిష్కరించకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. గ్యారేజీ అధికారి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేష్, డిపో చైర్మన్ చలపతి, అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి మౌలా, బాబు, నారాయణ, మురళీధర్, శంకరయ్య, ఈశ్వరయ్య, చంద్ర, రహంతుల్లా, రామయ్య, సునీల్, గ్యారేజీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీరింగ్‌పై గెస్ట్ లెక్చర్

రాజంపేట, ఫిబ్రవరి 2 : మండలంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బిల్డింగ్ సర్వీసెస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఎన్‌బీకేఆర్ఐఎస్‌టి ప్రొఫెసర్ పి.వి.సుబ్బారెడ్డి గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజైనింగ్ వంటి విభాగాలలో నైపుణ్యాన్ని పెంచుకుంటే స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చునన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి, ఛైర్మన్ చొప్పా రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.నరేష్‌కుమార్, అధ్యాపకులు ఎస్.వెంకట వరప్రసాద్, ఎ.అనిల్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు వీడ్కోలు

చిట్వేలి, ఫిబ్రవరి2 : చిట్వేలి తహసీల్దారు శిరీష బదిలీపై వెళుతున్న సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈమె స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా అనంతపురం వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు ఎల్.వి.మోహన్‌రెడ్డి తదితరులు తహశీల్దారు శిరీష సేవలను ప్రశంసించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, రైతులు, నాయకులు పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్ రామసుబ్బారెడ్డి, ఆర్ఐ శేషంరాజు, భాస్కర్, మహేశ్వర్‌రెడ్డి, భుజంగరావు, ఉదయ్, నరసింహులు, గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం

సిద్దవటం, ఫిబ్రవరి 2 : మండల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన మురుషద్ వలిని సిద్దవటం మండల జనసేన పార్టీ ముస్లిం మైనారిటీ నాయకుడు మహబూబ్‌బాషా (బాబి) సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నేతలు ఆరిఫ్ బాషా, మౌలాలి, మస్తాన్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో సిమెంటు రోడ్డు పనులు

పుల్లంపేట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ నిధులతో సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించారు. నాలుగు లక్షల రూపాయలతో ఈ పనులు చేస్తున్నామని గ్రామ పెద్ద శ్రీనివాస్ తదితరులు తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెనగలూరు, ఫిబ్రవరి 2 : మండల పరిధిలోని నారాయ ణ నెల్లూరులో శుక్రవారం సాయంత్రం సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి అధ్యక్షతన ఈవీఎంలపై గ్రామ ప్ర జలకు అవగాహన కల్పించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఈవీఎంలో ఓటు వేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వారికి వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కళాచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బెరైటీస్ అక్రమ టెండర్ ను రద్దు చేయాలి: సీఐటీయూ

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 2: బెరైటీస్ అక్రమ టెండర్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మంగంపేట ఏపీ ఎండీసీ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగంపేట స్టాకు యార్డులో సీ, డీ గ్రేడు ముగ్గురాయి 75 లక్షల టన్నులు మాత్రమే నిల్వ ఉండగా, ఇంకా తీయని 25 లక్షల మెట్రిక్ టన్నులకు అక్రమంగా టెండర్లు పిలవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గత నెల 24న టెండర్ పిలిచారని, ఈ నెల 8న టెండర్ ఓపెన్ చేస్తున్నారన్నారు. ఇంత హుటాహుటిన నిర్ణయం తీసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ టెండర్‌లో పాల్గొనేందుకు రూ. 90 లక్షలు డిపాజిట్, డాక్యుమెంట్‌కు రూ. 25 లక్షలు చెల్లించాలన్న నిబంధన విధించడంతో చిన్న మిల్లులకు అన్యాయం జరుగుతోందన్నారు. తరచూ పారదర్శకతను ప్రస్తావించే వైసీపీ ప్రభుత్వం ఎందుకు ఇలా అక్రమాలకు పాల్పడుతోందని ప్రశ్నించారు. ప్రస్తుతం ఏ-గ్రేడు టన్ను రూ. 7,151, బీ-గ్రేడు టన్ను , రూ. 6359 లకు, సీ, డీ గ్రేడు టన్ను రూ. 2120 తో ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇలా ఉండగా టెండర్‌లో కనీస ధర రూ. 1200లు ఎలా ప్రకటించారన్నారు. గతం లో ఎక్స్‌పోర్టు కంపెనీలకు 60 శాతం, మిల్లులకు 40 శాతం రాయిని ఇచ్చే వారన్నారు. ప్రస్తుతం ఈ మిల్లులకు అవకాశం లేకపోవడంతో మంగంపేటలోని పలు పల్వరైజింగ్ మిల్లులు మూతపడి సుమారు 30 వేల మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయారన్నారు. ఎలాంటి సెక్యూరిటీ, డిపాజిట్ లేకుండా రాజకీయ వత్తిడి తో కొన్ని కంపెనీలకు వేల టన్నుల రాయిని ఇవ్వడంతోపాటు, కోట్ల రూపాయల ఖనిజం అప్పుగా కూడా ఇచ్చి, సంస్థను దివాళా తీయించేందుకు కొందరు నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. తక్షణం అక్రమ టెండర్ల ను రద్దు చేసి టెండర్ ను పారదర్శకంగా చేయాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు లింగాల యానాదయ్య, పి. జాన్‌ప్రసాద్, పి. మౌలాలిఖాన్, ముత్యాల శ్రీనివాసులు, బండారు రాజశేఖర్, డి. శంకర్‌రాజు, ఎం. విజయ్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

● మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి

రామాపురం, ఫిబ్రవరి 2: అరాచక వైసీపీ పాలనకు చరమ గీతం పాడుదామని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మండలంలోని గువ్వలచెరువు, కసిరెడ్డిగారిపల్లెల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ వ్యవస్థలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను పరామర్శించారు. గువ్వల చెరువు ఎంపీటీసీ సభ్యుడు మౌలా, రేఖం ఆంజనే యులు, రాజశేఖర్, శివయ్య, ఉమామహేశ్వర, రమణ, లోకేశ్, రాజు, కంచం సుబ్బారెడ్డి, నాగబసయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



ఇంటింటి ప్రచారంలో జనసేన నాయకులు

సుండుపల్లె, ఫిబ్రవరి2: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని జనసేన నాయకులు రాజా, చింతల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ ఒడిసెలవంక, జేసీ కుర్వపల్లెలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు మున్నా, మనోహర్, శ్రీను, సుంకర సుధారాణి పాల్గొన్నారు.

నందలూరు : మండలంలోని చెన్నయ్యగారిపల్లె, ఎల్లంరాజుపల్లి, ఈదరపల్లి, దుర్గాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను, పార్టీ ఎన్నికల గుర్తు గాజు గ్లాసును తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆకుల చలపతి, బారతాల ప్రశాంత్, తిప్పాయపల్లె ప్రశాంత్, వెలగచర్ల హరిబాబు, బత్యాల వినయ్, మంటి వెంకట సుబ్బయ్య, పోకూరి మల్లికార్జున, పాలూరు మహేష్, పైడికొండల సునీల్‌గౌడ్, చంద్రమౌళి, సుధాకర్, నరసింహ, సుబ్బు, బాలాజీ, వర్ల కార్తీక్, కరిముల్లా, హేమంత్, చిన్నయ్య, నరసింహ, నాని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలు ప్రజలకు వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 2: నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేయడంతోపాటు, వైసీపీ నేతల అక్రమాలను ప్రజలకు వివరించాలని రైతు నాయకుడు నాగినేని వెంకటరమణ, ఓటరు వెరిఫికేషన్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్, రాజంపేట పార్లమెంట్ ఐటీడీపీ కో-ఆర్డినేటర్ నరసింహులు, కోరారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రైల్వే కోడూరు, ఓబుల వారిపల్లె మండలాల్లోని క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నేతల అక్రమాలు, అన్యాయాలు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె, పెనగలూరు మండలాల్లో వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగిరిపాటి రేవతి, ఓబులవారిపల్లె మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రాజు, మాజీ సర్పంచ్ విజయభాస్కర్ రాజు, మహిళా నాయకురాలు మెహతాజ్, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మిక సంఘం నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి2: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, డివిజన్ అధ్యక్షుడు నగేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు అన్నమయ్య జిల్లా డిప్యూ టీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి కృషి చేయని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె మండల కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అశోక్, యూఈఈయూ ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి

గాలివీడు, ఫిబ్రవరి 2: పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జాకీర్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం మండలంలోని గాలివీడు, నూలివీడు ఎస్సీ బాలుర వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులందరూ పాసయ్యేలా కృషి చేయాలని వార్డెన్లకు సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కచ్చితంగా ట్యూషన్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహాల్లో సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు రవిబాబు, రవీంద్రనాయక్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆరా..



వైద్య సేవలపై సిబ్బందితో ఆరా తీస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

సంబేపల్లె, ఫిబ్రవరి 2: మండలంలోని దుద్యాల గ్రామ ఆరోగ్య ఉపకేంద్రాన్ని శుక్రవారం జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. జిల్లా గణాంకాధికారి ఓబుల్‌రెడ్డి, ఆర్‌సీహెచ్ డీపీ మునీశ్వర్లు ఉపకేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో అందుతున్న వైద్య సేవలు, 104 సేవలు, వ్యాక్సినేషన్, బాలింతలు, ప్రధాన మంత్రి మాతృయోజన, ప్రసవాలు తదితర కార్యక్రమాల నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్స్ బలరాంరాజు, సుగుణ, సీహెచ్‌వో, డీఈఎస్ రాణి, పీహెచ్ఎన్ పూర్ణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సదాశివారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న విమర్శించారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్ 2024-25 బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వ్యవసాయ రంగాన్ని తుంగలో తొక్కి కార్పొరేట్లకు ఊరటనిచ్చారన్నారు. కడపవిశాఖ ఉక్కు పరిశ్రమలపై మాట్లాడక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు స్వరూప్. తేజ పాల్గొన్నారు

టీవీ టెక్నీషియన్స్‌కు నైపుణ్య శిక్షణ

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి2: టీవీ టెక్నీషియన్ స్కిల్స్ ప్రతి ఒక్క నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి సూరిబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో అన్నమయ్య జిల్లాలోని టీవీ టెక్నీషియన్స్‌కి రెండు రోజుల పాటు అప్ స్కిల్లింగ్ ప్రోగ్రాం (ఆర్‌పీఎల్) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇండస్ట్రీస్ ఆఫీసర్ సూరిబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలో టీవీ టెక్నీషియన్స్‌కి రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (ఆర్‌పీఎల్) పథకం కింద కొత్త టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని 120 మంది టీవీ టెక్నీషియన్స్‌కు రెండు రోజుల పాటు ప్రస్తుత టెక్నాలజీ, అత్యాధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తామన్నా రు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండస్ట్రీస్ ఆఫీసర్ సూరిబాబు, టీవీ టెక్నీషియన్స్ స్టేట్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ రీజనల్ కోఆర్డినేటర్ లాలూ, సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, షిరిడిసాయి ఎడ్యుకేషన్ సొసైటీ మనోహర్‌రెడ్డి, టీవీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ హరికిశోర్, ఉస్మాన్‌బాషా, ఫజుల్ రెహమాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





నంబాలపల్లెలో జల్లికట్టు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 2: సంక్రాంతి ముగిసినా వెదురుకుప్పం మండలంలో జల్లికట్టు నిర్వహణ మాత్రం కొనసాగుతూనే ఉంది. శుక్రవారం నంబాలపల్లె (కేఎన్ పెంట) గ్రామంలో జల్లికట్టు జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కోడెగిత్తలను తీసుకొచ్చిన యజమానులు వాటి కొమ్ములకు బహుమతులను కట్టి అల్లిలోకి వదిలారు. కోడెగిత్తలను నిలువరించే ప్రయత్నంలో కొందరు యువకులు గాయపడ్డారు.

మణీంద్రంలో ఎద్దుల పండుగ

● ఘర్షణతో ఆపేసిన పోలీసులు

రామకుప్పం, ఫిబ్రవరి 2: రామకుప్పం మండలం మణీంద్రంలో శుక్రవారం ఎద్దుల పండుగ నిర్వహించారు. ఉదయం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ పశువులను గ్రామంలో ఊరేగించి, నడివీధి గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం తమ ఎద్దులను పరుగులెత్తించారు. ఎద్దులకు కట్టిన లుంగీలను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. కాసేపటల్లో పండుగ ముగుస్తుందనగా.. చేజిక్కించుకున్న లుంగీ విషయమై మణీంద్రం, అత్తికుప్పం గ్రామాలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ గొడవలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివకుమార్ మణీంద్రంకు చేరుకుని ఎద్దుల పండుగను నిలుపుదల చేశారు.

టీడీపీ దళిత నాయకుడి కుటుంబంపై దాడి

● పోలీసులకు ఫిర్యాదు

కల్లూరు, ఫిబ్రవరి 2: పులిచెర్ల మండలం పాతపేటకు చెందిన టీడీపీ దళిత నాయకుడు మునికృష్ణ, అతడి కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన కొందరు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఈ మేరకు మునికృష్ణ భార్య కవిత కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. పాతపేటకు చెందిన మునికృష్ణ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పాతపేట ఓటర్ల జాబితాలో తప్పులపై స్థానిక బీఎల్వోకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కూలిపనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తన భర్త మునికృష్ణతోపాటు మరిది హరికృష్ణ, తనను.. అదే గ్రామానికి చెందిన జి.శంకర్‌రెడ్డి, కె.భాస్కర్, జి.బాలాజి, జి.జ్ఞానమ్మ, కె.రాణెమ్మ తదితరులు దుర్భాషలాడటమే గాక దాడి చేశారని కవిత పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

సదుం, ఫిబ్రవరి 2: ఎర్రచందనం తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ సదుం పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ విశ్వనాథం కథనం మేరకు రాయచోటి నుంచి సదుం మీదుగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సదుం-కలికిరి మార్గంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కార్పియో వాహనం పోలీసులు ఆపినా ఆగకుండా వేగంగా ముందుకు దూసుకుపోయింది. వెంబడించగా గుండ్లూరువారిపల్లె రోడ్డు మార్గంలో వాహనాన్ని విడిచి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు పారిపోయారు. వాహనాన్ని, అందులోని 9 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనం నెంబరు ఆధారంగా విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రిన్సిపాల్ కొట్టారని ఆస్పత్రిలో చేరిన విద్యార్థి

పుంగనూరు, ఫిబ్రవరి2: పుంగనూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రిన్సిపాల్ కొట్టారని ఇంటర్ విద్యార్థి శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరాడు. పట్టణానికి చెందిన హసీఫ్‌ఉల్లా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీలో పుస్తకాలు కొనాలని అధ్యాపకులు ఒత్తిడి చేయగా, తాను బయట పుస్తకాలు కొనుగోలు చేస్తానని, ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారని అనడంతో తనను ప్రిన్సిపాల్ కొట్టారన్నాడు. తన కంటికి దెబ్బ తగలడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పాడు. ఈ విషయంపై కాలేజీ ప్రిన్సిపాల్ వసామా మాట్లాడుతూ.. సహ విద్యార్థులను హసీఫ్‌ఉల్లా దుర్భాషలాడటం, కాలేజీకి సక్రమంగా రాకపోవడంతో మందలించినట్లు తెలిపారు. పరీక్ష ఫీజులు చెల్లించాలని చెప్పడంతో తమపై ఎదురుతిరిగి అతడే బట్టలు చింపుకొని వచ్చేశాడని వివరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మంత్రి రోజా అనుచరుడిపై తిరుత్తణిలో ముసుగు వ్యక్తుల దాడి



గాయపడిన ప్రత్యూష్

నగరి, ఫిబ్రవరి 2: మంత్రి రోజా ప్రధాన అనుచరుడు ప్రత్యూష్‌పై తిరుత్తణిలో గుర్తుతెలియని ముగ్గురు ముసుగు ధరించిన వ్యక్తులు శుక్రవారం ఉదయం తిరుత్తణిలో దాడి చేశారు. వాకింగ్‌కు వెళ్లిన సమయంలో దాడి జరగ్గా, గాయపడిన ప్రత్యూష్‌ను మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. తిరుత్తణి సీఐ మదిఅరసన్, ఎస్ఐ రాకికుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడికి నగదు లావాదేవీలా? లేక రాజకీయ కారణాలా? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

తిరుమలలో ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆస్థానమండపంలో శనివారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న సనాతన ధార్మిక సదస్సుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది.హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సులో 59మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.మరికొంతమంది వర్చువల్‌గా సదస్సులో పాల్గొని ధార్మిక అంశాలపై చర్చిస్తారు.సదస్సు ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి పరిశీలించారు.శనివారం ఉదయం వేదస్వస్తి, టీటీడీ నిర్వహించిన ధార్మికకార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, పీఠాధిపతుల అనుగ్రహ భాషణం ఉంటాయి. మధ్యాహ్నం ప్రాథమిక గోష్ఠి, ద్వితీయ గోష్ఠి కార్యక్రమాలు జరుగుతాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,233 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.18,015మంది తలనీలాలు సమర్పించారు.



మార్కెట్ అధికారులను నిలదీస్తున్న టీడీపీ నాయకులు - వి.కోటలో కొత్తగా మండీలు ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన స్థలం



గుట్టుచప్పుడు కాకుండా వేలం పాటలు నిర్వహిస్తారా?

● పలమనేరులో మండీల వేలాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలు

పలమనేరు, ఫిబ్రవరి 2: పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద శుక్రవారం గుట్టుచప్పుడు కాకుండా మండీల వేలంపాటలు నిర్వహించేందుకు ప్రయత్నించిన అధికారులను టీడీపీ నాయకులు అడ్డుకొన్నారు. దీంతో గత్యంతరం లేక వేలం పాటలను శనివారం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వివరాలిలా... పలమనేరు మార్కెట్ కమిటీకి వి.కోటలో అనుబంధ మార్కెట్ వుంది. వి.కోట-కుప్పం రహదారిలో శివునికుప్పం సమీపంలో రహదారి పక్కనే పలమనేరు మార్కెట్ కమిటీకి చెందిన సుమారు 7 ఎకరాల స్థలంవుంది.ఈస్థలంలో కొత్తగా మామిడికాయల మండీలను ఏర్పాటుచేస్తే వి.కోట, రామకుప్పం ప్రాంత రైతులకు అనువుగా మార్కెట్ సౌకర్యం కల్పించినట్లు అవుతుందని అధికారులు భావించారు. దీంతో లక్షలాది రూపాయలువెచ్చించి ఎగుడుదిగుడుగా ఉన్న ఈస్థలాన్ని చదును చేయించారు. ఇక్కడ దాదాపు 40 మండీలు ఏర్పాటుచేసే అవకాశం వుంది. ఈ మండీలను కేటాయించేందుకు అధికారులు మార్కెట్ కమిటీ పరిధిలో లైసెన్సులు కలిగి ఉన్నవారు మాత్రమే మండీల కేటాయింపునకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనే విధంగా నిబంధనలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అధికారులు మండీల వేలం పాటలకు సంబంధించి ఏ పత్రికా ప్రకటన కూడా ఇవ్వలేదు. కడప ఆర్డీ సమక్షంలో వేలం పాటలు నిర్వహించేందుకు నిర్ణయించారు. కేవలం వైసీపీ మద్దతుదారులకు మాత్రమే అవకాశం ఉండేవిధంగా ఈ వ్యవహారం నడపడంతో విషయం తెలుసుకొన్న వి.కోట, పలమనేరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పలమనేరు మార్కెట్ యార్డుకు చేరుకొన్నారు. ఏమాత్రం ప్రచారం చేయకనే మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయాన్ని గండికొట్టేవిధంగా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు మండీల వేలం పాటలు నిర్వహిస్తారని మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ తోపాటు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వరన్‌ను నిలదీస్తూ బైఠాయించారు. వేలం పాటలు నిర్వహించేందుకు వచ్చిన ఆర్డీ కార్యదర్శి గదిలో ఉన్నందున ఆ గదిలోకి కూడా చొచ్చుకొని వెళ్లేందుకు తీవ్రంగా ప్రయిత్నించారు. అప్పటికే వివాదం ముదురుతుండటంతో సీఐ చంద్రశేఖర్, తమ సిబ్బందితో అక్కడికి వచ్చి ఆర్డీ గదిలోకి టీడీపీ నాయకులను వెళ్లకుండా అడ్డుకొన్నారు.శాంతియుతంగా అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు.ఆతర్వాత మండీల వేలం పాటలను శనివారం నిర్వహించేందుకు ఆర్డీ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా మార్కెట్ అధికారి పరమేశ్వరన్, కార్యదర్శి సంజీవకుమార్ ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులకు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఆందోళనలో వి.కోట మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, పలమనేరు పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆర్బీసీ కుట్టి, నాయకులు గిరిబాబు, నాగరాజు, బ్రహ్మయ్య, ఖాజాపీర్, మన్నారునాయనిపల్లి ఆనందనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలంలో నేతలతో చర్చిస్తున్న పులివర్తి నాని

ప్రతిష్ఠాత్మకంగా 'రా.. కదలిరా' నిర్వహిద్దాం

● టీడీపీ శ్రేణులకు పులివర్తి నాని పిలుపు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 2: గంగాధరనెల్లూరు పంచాయతీ రామానాయుడుపల్లె వద్ద ఈనెల ఆరో తేదీన చంద్రబాబు హాజరుకానున్న రా...కదలిరా బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిద్దామని టీడీపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం బహిరంగ సభ స్థలం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు రవిప్రకాష్, పలువురు నేతలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుండయ్య, మండల ప్రధానకార్యదర్శి జ్యోతీశ్వరరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్, నేతలు భాస్కర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, మురళీశ్వరరెడ్డి, సిద్దయ్యశెట్టి, గిరినాయుడు, జయప్రకాష్, రాజేష్ పాల్గొన్నారు.

ఆరు మండలాలకు ఇన్‌చార్జిల నియామకం

రా...కదలిరా బహిరంగసభ కోసం ఆరు మండలాలకు ఇన్‌చార్జిలను నియమించారు. గంగాధరనెల్లూరుకు మలశెట్టి వెంకటేశ్వర్లు, పాలసముద్రానికి యుగంధర్, పెనుమూరుకు దొడ్డపనేని రాజానాయుడు, వెదురుకుప్పానికి నైనారు పున్నారావు, కార్వేటినగరానికి శివకుమార్, శ్రీరంగరాజుపురానికి పర్వీన్‌తాజ్ ఉన్నారని పులివర్తి నాని తెలిపారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

చిత్తూరు సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా, నియోజకవర్గ, డివిజన్, వార్డు స్థాయి నాయకులందరూ సభ విజయానికి కృషిచేయాలన్నారు. నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, గురజాల జగన్మోహన్, కటారి హేమలత, సుబ్రమణ్యం నాయుడు, త్యాగరాజన్, జయచంద్ర నాయుడు, మోహన్‌రాజ్, శశికర్ బాబు పాల్గొన్నారు.



జోరందుకున్న ఏర్పాట్లు

బహిరంగ సభ నిర్వహించే స్థలంలో ఏర్పాట్లు జోరందుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శ్రీరంగరాజుపురం, గంగాధరనెల్లూరు, కార్వేటినగరం మండలానికి చెందిన టీడీపీ నేతలు ఆధ్వర్యంలో సుమారు 10 ఎక్స్‌కవేటర్లతో ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు, చిన్న చిన్న రాళ్లను తొలగించారు. సాయంత్రానికల్లా స్థలాన్ని శుభ్రం చేశారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి : డీఆర్వో

సమీక్షలు - సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్ పరీక్షల అధికారులతో సమీక్షించారు. పరీక్షలు మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు 50 పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయని చెప్పారు. 15,905 మంది ప్రథమ, 16,852 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. డీఈవీవో సయ్యద్ మౌలాలా, డీఈవో విజయేంద్ర రావు, డీఈసీ సభ్యులు దయానంద రాజు, బాలసుబ్రహ్మణ్యం రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని డీఆర్వో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డీఆర్వో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత మార్పులు, చేర్పులను అత్యంత జాగ్రత్తగా చేస్తున్నామని చెప్పారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, జీడీ నెల్లూరు ఈఆర్వో భవాని, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేపట్టామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 256 జగనన్న లే అవుట్లలో 24,699 ఇళ్ల స్థలాలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసిందని చెప్పారు. రెండ్రోజులుగా 92 గ్రామ, వార్డు సచివాలయాల్లో వీఆర్వోలు వెయ్యి ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై పదేళ్ల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని, ఆ డాక్యుమెంట్లలో పేర్కొన్నట్లు వివరించారు. డాక్యుమెంట్‌లో ఆ స్థలానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విలువ, భూ సేకరణ ద్వారా ఆ భూమిని సేకరిస్తే ఉన్న విలువను కూడా ముద్రిస్తున్నట్లు చెప్పారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం అన్ని చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ క్రమంలో శుక్రవారం యాదమరి మండలం కోణాపల్లె సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.



కోణాపల్లె సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

ఐఏఎస్‌ల తీరు బాధాకరం

టీడీపీ, జనసేన

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 2: చేసిన తప్పులకు ఇప్పటికే కొందరు ఐఏఎస్‌లు శిక్ష అనుభవిస్తున్నా కొత్తగా వచ్చిన వారిలో ఏ మాత్రమూ మార్పు కనిపించకపోవడం బాధాకరమని టీడీపీ, జనసేన నాయకులు విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ నాయకుడు వూకా విజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశా, నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికెళ్లి సన్మానాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కుమారుడు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం, మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ ఇద్దరు ఐఏఎస్‌ల తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈసీ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, ఆ ఇద్దరు అధికారులను రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికార పార్టీకి తగినట్లుగా అధికారుల బదిలీలు జరిగాయని ఆరోపించారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో జరుగుతున్న అవకతవకల వల్ల ప్రజాస్వామ్యంపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వూకా విజయకుమార్, కిరణ్ రాయల్

కలెక్టర్‌ను ఈసీ రీకాల్ చేయాలి

జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశాను ఈసీ రీకాల్ చేయాలని టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు చిన్నబాబు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కలెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తి తిరుపతి ఎమ్మెల్యే ఇంటికెళ్లి కలవడం, సన్మానం చేయడం దారుణమన్నారు. కలెక్టర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం రీకాల్ చేసి ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని ఒంగోలుకు మార్చడం అక్కడ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించేందుకేనని ఆరోపించారు. వైసీపీకి విధేయుడిగా ఉంటున్న తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేయడం కూడా అలాంటిదేనన్నారు. తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని డీటీసీగా బదిలీ చేశారన్నారు. టీడీపీ నాయకులు రాజేంద్రప్రసాద్, స్రవంతి, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.



రాహు కేతు పూజల్లో రష్యన్ భక్తులు

ముక్కంటి సేవలో రష్యన్లు

శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం 30మంది రష్యన్లు దర్శించుకున్నారు.అంతకుముందు ఆలయంలోని రాయలవారి మండపంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు.దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితుల ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆలయంలోని పొగడ చెట్టు వద్ద శివనామస్మరణ చేశారు.ముక్కంటి ఆలయ శిల్ప సౌందర్యం ఆకట్టుకుందని తెలిపారు. - శ్రీకాళహస్తి

జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 అనుసంధాన పనులు షురూ



శ్రీహరికోటలోని షార్‌లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.ఈ ఏడాది తొలి రోజు ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ ద్వారా ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. ఇదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు ఈ నెల 17న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ద్వారా ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఇందులో అత్యాధునిక 19 పేలోడ్‌లను కూడా పంపుతున్నారు.షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్ద ఇప్పటికే రెండు దశల అనుసంధాన పనులు పూర్తి కాగా మూడవ దశ పనులు జరుగుతున్నారు.గత నెల 27న బెంగళూరులోని ఉపగ్రహ తయారీ కేంద్రం నుంచి ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని షార్‌కు తీసుకొచ్చారు. క్లీన్‌రూమ్‌లో ఉపగ్రహాన్ని పెట్టి తుది పరీక్షలు నిర్వహించారు.దీన్ని హీట్‌షీల్డ్‌లో అమర్చి రాకెట్ శిఖర భాగాన అనుసంధానిస్తారు. 2275 కిలోల బరువు గల ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహం ద్వారా వాతావరణ పరిస్థితుల అంచనాతో పాటు విపత్తుల హెచ్చరికలను తెలుసుకోవచ్చు. - సూళ్లూరుపేట

రైలు కింద పడి యువకుడు మృతి


విష్ణువర్దన్ (ఫైల్‌ఫొటో)

వాల్మీకిపురం, ఫిబ్రవరి 2: రైలు కింద పడి ఆర్.విష్ణువర్దన్(22) అనే యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం వాల్మీ కిపురం సమీపంలోని పునుగుపల్లె ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం బసిని కొండ ప్రాంతం గంగన్నగారిపల్లెకు చెందిన కనమన్న కుమారుడు ఆర్.విష్ణువర్దన్ వాల్మీకిపురం సమీపంలోని పునుగుపల్లెలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. అయితే వేకువజామున పల్లెకు సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. స్థానిక పోలీసులు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని కదిరి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదానికి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఆటో బోల్తా .. ఐదుగురికి గాయాలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2: కర్ణాటక రాష్ట్రం రాయలపాడు నుంచి ప్రయాణికులతో మదనపల్లెకు వస్తున్న ఆటో బోల్తా పడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. మాలేపాడుకు చెందిన మల్లికార్జున ఆటోలో ప్రయాణికులు చేరవేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మల్లికార్జున తండ్రి జల్లా బాబు(62)కు అనారోగ్యంతో ఉండటంతో రాయలపాడులో నాటువైద్యం చేయించేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పుడు ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని మదనపల్లె వస్తుండగా మార్గమధ్యంలోని బార్లపల్లె వద్ద ఆవులు అడ్డంగా రావడంతో స్పీడ్‌బ్రేకర్ వద్ద ఎగిరిన ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెడ్డెప్ప (70), సిద్దమ్మ (75), మల్లికార్జున (50), బాబు (62), శ్రీలక్ష్మి (65) గాయపడగా వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాటుసారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 2: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న మేకల రెడ్డెప్ప(33) అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 15లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతి ఎర్రాతివారిపల్లికి చెందిన రెడ్డెప్ప నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 15లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు తలించినట్లు తెలిపారు. అయితే రెడ్డెప్ప వాల్మీకిపురం మండలం, మేకలవారిపల్లి చెందిన వ్యక్తిగా తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం నిందితుడు అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 2: మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ తుమ్మణంగుట్ట రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసనుకోవడంతో పాటు నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా 18 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని బి.కొత్తకోట మండలం మల్లూరివారిపల్లెకు చెందిన వెంకటరమణ(40)ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కలకడ సీఐగా శ్రీనివాసులు



కలకడ, ఫిబ్రవరి 2:కలకడ పోలీస్ సర్కిల్ కార్యాలయ సీఐగా డి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన కడప జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి కలకడకు వచ్చారు. కాగా ఇక్కడ సీఐగా పని చేసిన నాగేంద్ర రాయచోటి దిశా స్టేషన్‌కు బదిలీ చేశారు.

బి.కొత్తకోటకు సూర్యనారాయణ



సీఐ సూర్యనారాయణను అభినందిస్తున్న ప్రజలు

బి.కొత్తకోట ఫిబ్రవరి 2 : బి.కొత్తకోట నగర పంచాయతీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న సూర్యనారాయణను బి.కొత్తకోటలో ఎస్ హెచ్‌వోగా పోస్టింగ్ ఇస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం బి.కొత్తకోటకు చేరుకుని ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట పరిధిలో శాంతి భద్రతల పర్యవేక్షణకు ప్రయత్నిస్తామన్నారు. ఇంత కాలం ఇక్క డ ఎస్ఐ విధులు నిర్వహిస్తుండగా, స్థాయిని పెంచాక ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించ బోతున్నారు. ఆ క్రమంలోనే మొదటి సీఐగా సూర్యనారాయణ జాయిన్ అయ్యారు. ఇంతకు మునుపు పొరుగు మండలం పీటీ ఎంలో ఎస్ఐగా పని చేసిన సూర్యనారాయణ ఈ ప్రాంతానికి సుపరిచితులు కావడం గమనార్హం. కాగా సీఐని స్థానికులు అభినందించారు.

కలికిరికి మోహన్ నియామకం

కలికిరి, ఫిబ్రవరి 2: కలికిరి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసుగా ఆర్. మోహన్‌ను నియమించారు. అనంతపురం జిల్లా నుంచి ఆయన బదిలీపై రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రహీముల్లాను కేవీ పల్లెకు బదిలీ చేశారు. కాగా కలికిరి పోలీసు స్టేషన్‌ను సీఐ స్థాయికి ఇటీవలే అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఎస్ఐకి బదులుగా సీఐ స్థాయి అధికారి మోహన్‌ను నియమించారు. ఇక నుంచి ఎస్ఐకు బదులుగా సీఐ స్థాయి అధికారే పూర్తి స్థాయి స్టేషన్ హౌస్ ఆఫీసరుగా వ్యవహరించనున్నారు. .

గుర్రంకొండ ఎస్ఐగా నాగార్జున్‌రెడ్డి



గుర్రంకొండ, ఫిబ్రవరి 2:గుర్రంకొండ ఎస్ఐగా నాగార్జున్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ దిలీప్‌కుమార్ బదిలీపై పీలేరుకు వెళ్లారు. దీంతో గుర్రంకొండ ఎస్ఐగా నాగార్జున్‌రెడ్డి నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం భారీ ర్యాలీ


పోస్టర్ విడుదల చేస్తున్న పొదల నరసింహులు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 2: ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం ఈ నెల 5వతేదీన భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు పొదల నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండులో భారీ ర్యాలీ పోస్టను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయయ మాట్లాడుతూ వాల్మీకుల రిజర్వేషన్ సాధనకు ఎన్నో ఉద్యమాలు, సభలు ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లిలో నిర్వహించే ర్యాలీకి పెద్ద ఎత్తన తరలి రావాలని కోరారు. క్రిష్ణమూర్తి, సాంబయ్య, రాధిక పాల్గొన్నారు.

టీడీపీ విజయమే లక్ష్యంగా పోరాడుదాం

- వైసీపీ తాలిబన్ పాలన నుంచి విముక్తి కల్పిద్దాం
- టీడీపీ రాగానే భూ బాధితులకు న్యాయం చేస్తాం
- తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్


ములకలచెరువులో జయహో బీసీ సభలో మాట్లాడుతున్న తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

ములకలచెరువు, ఫిబ్రవరి 2: తెలుగుదేశం పార్టీ విజయానికి కలిసి కట్టుగా పోరాడుదామని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్ యాదవ్ పేర్కొన్నారు. ములకలచెరువులోని కేజీఎన్ కళ్యాణమండలంలో శుక్రవారం తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో తాలిబన్ తరహాలో వైసీపీ ప్రభుత్వం పాలన చేస్తోందని దుయ్యబట్టారు. మళ్లీ మంచి పాలన రావాలంటే నియోజకవర్గ గడ్డపై టీడీపీ, జనసేన జెండాలు ఎగరాలన్నారు. ప్రస్తుత పాలకులకు చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గంలో ప్రజల నుంచి లాక్కున్న భూములు తిరిగి ఇచ్చేయాలన్నారు. లేదంటే త్వరలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని అధికార పార్టీ నేతలు భయపెట్టి లాక్కున్న భూములు తిరిగి బాధితులకు ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల భూమిని కబ్జా చేశారని, పాపాఘ్ని నది నుంచి ఇసుకను దోచేశారని ఆయన ఆరోపించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీసీ కులాలను జగన్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. జగన్ పాలనలో 75 మంది బీసీలను హత్య చేశారన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ తదితరులు మాట్లాడుతూ అరాచక, అవినీతి పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, టీడీపీ నేతలు శ్రీనాథరెడ్డి, కుడుం శ్రీనివాసులు, చెన్నకిష్టా, కేవీ రమణ, కేశవులు, ముత్తుకూరు మౌలా, జేసీబీ సుదాకర్‌నాయుడు, నాగరాజు యాదవ్, గుత్తా సుధాకర్ నాయుడు, నాయకులు కట్టా హరినాథ్, కాలా మహేష్, షామీర్, సుధాకర్‌నాయుడు, నారాయణస్వామి, రెడ్డెప్ప, రమణమూర్తి, రామాంజులు, బుర్రా రమణ, చాంద్‌బాషా, జనసేన నాయకులు నాగరాజు, అమరనాథ్, బావాజాన్, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములకలచెరువులో ప్రభంజనంలా సాగిన జయహో బీసీ

ములకలచెరువులో శుక్రవారం జరిగిన తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి జయహో బీసీ కార్యక్రమం ప్రభంజనలా సాగింది. టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సర్కిల్ నుంచి కేజీఎన్ కళ్యాణమండపం వరకు సూమారు ఐదు కిలోమీటర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడువునా టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున బాణా సంచా కాల్చారు. జయహో బీసీ కార్యక్రమం అనంతరం మాజీ ఎమ్మెల్యే శంకర్ ఎన్నికలకు సంసిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు.

కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్‌గా పూర్వ వీసీ రంగజనార్దన్



కలికిరి, ఫిబ్రవరి 2: అనంతపురం జేఎన్టీయూగా వీసీగా ఇటీవల వరకూ పనిచేసిన జె.రంగజనార్దన్‌ను కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా నియమించారు. రంగజనార్దన్‌కు బదులుగా జేఎన్టీయూ వీసీగా జీవీఆర్ శ్రీనివాసరావును ఇటీవలే ప్రభుత్వం నియమించింది. దీంతో అప్పటి వరకూ వీసీగా ఉన్న ప్రొఫెసర్ రంగజనార్దన్‌ను కలికిరి కళాశాలలో బోధన కోసం ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన కళాశాల మెకానికల్ విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టారు. కాగా గతంలో జేఎన్టీయూ వర్సిటీ రిజిస్ట్రారుగా ఉన్న ఎస్.కృష్ణయ్యను కూడా రెండేళ్ల క్రితం కలికిరి ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రొఫెసర్ కృష్ణయ్య సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇదే కృష్ణయ్య కళాశాల ప్రారంభంలో ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు.

తహసీల్దారు, ఎంపీడీవో బదిలీ


తహసీల్దారు శ్రీనివాసులును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 2: త్వరలో జరుగనున్న ఎన్నికల సందర్భంగా తంబళ్లపల్లె తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్ బదిలీ అయ్యారు. ఎంపీడీవో సురేంద్రనాథ్‌ను కడప జిల్లాకు, తహసీల్దారు శ్రీనివాసులును అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. బదిలీ అయిన తహసీల్దారు శ్రీనివాసులును శుక్రవారం రెవెన్యూ సిబ్బంది పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

బి.కొత్తకోటలో రేపు ఆత్మీయ సమ్మేళనం

బి.కొత్తకోట ఫిబ్రవరి 2 : బి.కొత్తకోట నగర పంచాయతీ లోని కొండా ఎస్టేట్‌లో ఈ నెల 4న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తు న్నట్లు ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండా నరేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై మేధావులు, రాజకీయ వేత్తలతో చర్చ ఉంటుందన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

జాబ్‌మేళాలో ఏడుగురికి ఉద్యోగాలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2: మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఏడుగురు అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో శ్రీరామ్ ఫార్చ్యూన్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది అభ్యర్థులు పాల్గొనగా, వారిలో ప్రతిభ కనపరచిన ఏడుగురిని సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి రూ.12వేల నుంచి రూ.20వేల వరకు వేతనం అందుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

సర్వేలో గుర్తించిన వారందరికీ టోకెన్లు జారీ చేయాలి


రోగులను విచారిస్తున్న లోకవర్ధన్

కలికిరి, ఫిబ్రవరి 2: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జరిగిన ఇంటింటా సర్వేలో అనారోగ్యంతో గుర్తించిన వారందరికీ టోకెన్లు జారీ చేసి శిబిరాలకు హాజరయ్యేటట్లు చూడాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ స్పష్టం చేశా రు. మేడికుర్తిలో శుక్రవారం జరి గిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కావ్యగంధ, ఇన్‌చార్జీ ఎంపీడీవో పరశు రాం, ప్రత్యేక వైద్య నిపుణులు, ఏఎన్ఎం లు, సీహెచ్‌వోలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 2: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వైద్యురాలు ఆశాలత పేర్కొన్నారు. శుక్రవారం పరసతోపు సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆశాలత, తేజస్వి, వంశీధర్‌రెడ్డిలు సుమారు 300 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనంద్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్న్ షిప్‌కు మిట్స్ విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 2: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జపాన్‌లోని ఐజు యూనివర్సిటీ ఇంటర్న్ షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఫైనలియర్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు చరణ్ తేజ, హరీష్‌కుమార్‌రెడ్డిలు ప్రొఫెసర్ ఉదయ్ కిరణ్ తేజ్ ఆధ్వ ర్యంలో పరిశోధనలు చేస్తారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి నాదెళ్ళ ప్రిన్సిపాల్, డీన్ శ్రీమంత్‌బసు, విజయలక్ష్మి అభినందించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో నరసింహ స్వామి

గుర్రంకొండ, ఫిబ్రవరి 2:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, అనిల్, గోకుల్, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీలతోనే రాష్ట్రాభివృద్ధి


మదనపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న జనసేన-టీడీపీ నాయకులు

మదనపల్లె, ఫిబ్రవరి 2: జనసేన-టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని మదనపల్లె జనసేన నాయకుడు శ్రీరామ రామాంజినేయులు పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండు, పటేల్ రోడ్డు సర్కిల్‌లో 51వ రోజు జనసేన, టీడీపీ నాయకులు ఉమ్మడి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వాసులు జనసేన, టీడీపీ నాయకులకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. శ్రీరామరామాంజినేయులు మాట్లాడుతూ... ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఇదే ఉత్సాహంతో నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరంగా పర్యటించి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు జనసేన సిద్ధాంతాలను వివరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి కూటమి గెలుపునకు అహర్నిశలూ కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, పట్టణ అధ్యక్షులు నాయని జగదీష్, దారం హరిప్రసాద్, శ్రీరామహరిహరన్, వరుణ్‌వర్మ, ఉదయ్ భాస్కర్, చంద్రశేఖర్, శంకర, గోపాల్, హర్ష, ధరణి, సోము, యాసిన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సత్యాగ్రహ నిరసన దీక్ష

మదనపల్లె, ఫిబ్రవరి 2: వైసీపీ ప్రభుత్వంలో గత నాలుగున్నరేళ్లగా పేద, మధ్య తరగతి వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై వీసీకే పార్టీ, బాస్ ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక సత్యాగ్రహ నిరసన దీక్ష చేపడుతున్నట్లు వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకే పార్టీ నాయకులతో కలసి సామాజిక సత్యాగ్రహం వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నర ఏళ్లుగా పేద ప్రజలకు చేస్తున్న దగాపై వ్యక్తమౌతున్న ధర్మాగ్రహమే తాము చేపట్టిన సామాజిక సత్యాగ్రహం అన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద మధ్యతరగతి వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని సహజ వనరులను యథేచ్ఛగా ఈ వైసీపీ ప్రభుత్వం లూటీ చేస్తోందని విమర్శించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ఈ సత్యాగ్రహం నిరసన దీక్షలో వీసీకే, బాస్ ప్రతినిధు లతో పాటు ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రగతిశీల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

108 వాహనంలో సుఖప్రసవం


108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన భువనేశ్వరి

బి.కొత్తకోట ఫిబ్రవరి 2 : పీటీఎం మండలం కమ్మచెరువుకు చెందిన రైతు కూలీ రాజశేఖర్ భార్య భువనేశ్వరి రెండవ కాన్పు 108 వాహనంలో సుఖప్రసవం అయ్యారు. ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు ఆమెను బి.కొత్తకోట పిహెచ్‌సికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్ ఆమెను పరిక్షించి ఇక్కడ ప్రసవం చేయడం కష్టమని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తీసుకుపోవాలని చెప్పారు. చేసేది లేక కుటుంబీకులు భువనేశ్వరిని 108 వాహనంలో మదనపల్లెకు తీసుకుని బయలుదేరారు. అయితే మదనపల్లెకు చేరక మునుపే 108 వాహనంలో ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది ఈఎంటీ శైలజ, పైలెట్ చలపతి, ఆశా వర్కర్ ఆదెమ్మలు భువనేశ్వరికి కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి మాటలు ఎవ్వరూ నమ్మరు

- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్


మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జనవరి 2: మదనపల్లెకు వచ్చినప్పుడల్లా బీటీ కళాశాలను యూనివర్సిటీ చేస్తామని, రూ.5వేల కోట్లతో పులివెందుల నుంచి మదనపల్లెకు తాగునీటి పైప్‌లైన్ ప్రాజెక్టు నిర్మిస్తామని పిట్టలదొరలా మాటలు చెప్పే ఎంపీ మిదున్‌రెడ్డిని మదనపల్లె ప్రజలు నమ్మరని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎంపీగా పదేళ్లగా ఉన్న మిధున్‌రెడ్డి పార్లమెంట్ ప్రజలకు ఇచ్చిన ఒక్క మాటను కూడా నిలబెట్టుకోలేదన్నారు. మదనపల్లె బీటీ కళాశాలను యూనివర్సిటీగా మారుస్తూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటారని ఎంపీ స్వయంగా ప్రకటించారని కాని ఆయన మాట చెల్లుబాటు కాలేదన్నారు. ప్రజలకు మేలు చేయలేని ఎంపీ, అతని అనుచరులు గుర్రంకొండ మండలం అరిగిలవారిపల్లెకు చెందిన బీసీ రైతు బోరుబావిని వైసీపీ నాయకుల చెప్పుడు మాటలు విని సీజ్ చేయించి రైతు పొట్టకొట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజన్న, రెడ్డెప్ప, రామప్పనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి టీడీపీ తోనే సాధ్యం


గ్రామస్థులతో టీడీపీ నాయకుడు దాసరిపల్లి జయచంద్రారెడ్డి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 2: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పెద్దమండ్యం, మందలవారిపల్లి, బండ్రేవు, రామానాయక్ తండా, పాపేపల్లి, వెలిగింటివాపల్లి, చల్లావారిపల్లి, గుడిసెవారిపల్లి గ్రామాల్లో పర్యటించి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును సీఎం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో అన్ని కుల వృత్తుల వారికి, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి అండగా నిలిచిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధిక ధరలతో మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. అనంతరం సీనియర్ రాజకీయ నాయకుడు బాలపోగు నరసింహులును ఆయన పరామర్శించారు. ముందుగా పాపేపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ వేమయ్య, చల్లపల్లి వేణుగోపాల్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ హసీంసాహెబ్. గల్లా నారాయణ, సీతాపతిరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం



యాత్రకు సంఘీభావం తెలుపుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్

కురబలకోట, ఫిబ్రవరి 2: కార్మికుల సంక్షేమమే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జి.రామరాజులు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి కుప్పం వరకు టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్మిక చైతన్య యాత్ర శనివారం మండలంలోని అంగళ్లకు చేరుకోగా టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం కార్మికులను పూర్తిగా విస్మరించి రోడ్డున పడేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కార్మికులను అన్ని విధాలా ఆదుకుని న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో పరుచూరి ఫణీశ్వరరావు, శివాజి, సూర్యప్రకాస్, మోహన్, సూరి, శివ, శ్రీనివాసులు, ఆలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఈపీని తిరస్కరించాలంటూ సంతకాల సేకరణ


ప్రజలు, విద్యార్థుల నుంచి సంతకాలు సేకరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2: జాతీయ విద్యావిధానం-2020 (ఎన్ఈపీ)ని తిరస్కరించాలని పిలుపునిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక జడ్పీహైస్కూల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ నేత మురళి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ రమణ మాట్లాడుతూ ఎన్ఈపీ విధానం వలన విద్యార్థులు సంక్షోభంలో చిక్కుపోతున్నారన్నారు. దీనివల్ల అట్టడుగు వర్గాల్లోని విద్యార్థులు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్ఈపీ విధానం వలన ఉన్నత వర్గాల వారికి మేలు కలిగించేలా రూపొందించారన్నారు. ఇలాంటి విధానం వలన ప్రజలకు, పేద విద్యార్థులకు న్యాయం జరగదన్నారు. ఈ విధానాన్ని తిరస్కరిస్తూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేసి కేంద్రానికి పంపుతామన్నారు. కార్యక్ర మంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భవిత, ఓబులేసు, వినయ్, శ్రీనాథ్, గణేష్ పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం


ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించడం కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ తెలిపారు. ప్రత్యేక హోదా కోసం డిల్లీలో నిరసన దీక్ష చేస్తున్న ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిళకు మద్దతుగా శుక్రవారం పీలేరులో ఎన్ఎస్‌యూఐ శ్రేణులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వడంలో బీజేపీ, వైసీపీ విఫలమయ్యాయన్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని ఉద్యమాల రూపంలో ఇప్పటి వరకు సజీవంగా ఉంచింది కాంగ్రెస్ పార్టీయేనని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు సాయిసంపత్, యూసుఫ్, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా నిరసనలో పీలేరు కాంగ్రెస్ నేత


జంతర్‌మంతర్ నిరసనలో పాల్గొన్న పీలేరు కాంగ్రెస్ పార్టీ నేత సోమశేఖర్ రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 2: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించకపోవడాన్ని ప్రశ్నిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ శుక్రవారం ఢిల్లీలో చేపట్టిన దీక్షలో పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బి.సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు ఇతర విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాజధానికి నిధులు తదితర అంశాలపై జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, ఎస్సీ సమన్వయకర్త కొప్పుల రాజు, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంతోపాటు పలువురు అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నట్లు సోమశేఖర్ రెడ్డి వివరించారు.

టీడీపీ ప్రొఫెషనల్ విభాగం అధ్యక్షుడుగా నవీన్


నవీన్‌కు నియామక పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2: మదనపల్లె నియోజకవర్గం టీడీపీ ప్రొఫెషనల్ విభాగం అధ్యక్షుడుగా పెరవలి నవీన్‌ను నియమిస్తూ మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమలో దొమ్మలపాటి రమేశ్ మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో చాలా మంది యువత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తు న్నారన్నారు. వారందరిని కలుపుకుంటూ మదనపల్లెలో టీడీపీ బలోపేతానికి మరిం తగా కృషి చేయాలని నవీన్‌కు సూచించారు. అలాగే ప్రధానకార్యదర్శిగా మర్రిపాటి రమే శ్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ విత్ సీబీఎన్ కమిటి సభ్యులు నిరంజన్‌నాని, నరసింహ, మహేష్, రాజేష్‌లు వీరిని అభినందించారు.